సాక్షి అనకాపల్లి

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024

అనంతుని లోగిలి దీపకాంతుల సిరి



గిరి పరిసరాలు.. చిమ్మ చీకట్లో వెలుగు దివ్వెల కాంతితో నూతన శోభను సంతరించుకున్నాయి. దేవ దేవుడైన అనంత పద్మనాభ స్వామి నామస్మరణతో మార్మోగాయి. పోటెత్తిన జనంతో పద్మనాభుని గిరి భక్త జనసాగరంగా మారింది. వేల దీప కాంతులు ఆధ్యాత్మిక వెలుగులను విరజిమ్మగా భక్తులు పులకితులయ్యారు. ఇది పద్మనాభంలో శనివారం సాయంత్రం నిర్వహించిన అనంత పద్మనాభుని దీపోత్సవ వైభవం. 8లో

న్యూస్‌రీల్

నేడు వైజాగ్ మారథాన్

విశాఖ స్పోర్ట్స్ : వైజాగ్ మారథాన్ మూడో ఎడిషన్ ఆదివారం సాగర తీరంలో జరగనుంది. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు విభాగాల్లో పరుగు నిర్వహించనున్నారు. ఔత్సాహికుల్ని ప్రోత్సహించేందుకు సరదా రన్‌గా మూడు కిలోమీటర్ల పరుగును ఉదయం 6.30 గంటలకు నిర్వహించనున్నారు. ఇక మిగిలిన మూడు విభాగాల్లో విజేతలకు ఐదు లక్షల నగదు ప్రోత్సాహకాల్ని అందజేయనున్నారు. విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు సన్నాహకంగా ఈ వైజాగ్ మారథాన్‌ను పోలీస్, జీవీఎంసీ సహకారంతో నిర్వహించనున్నారు. సాగర తీరంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి ఉదయం 5 గంటలకు హాఫ్ మారథాన్, 5.30 గంటలకు 10 కిలోమీటర్ల పరుగు, 6.15 గంటలకు 5 కిలోమీటర్ల పరుగు ప్రారంభం కానుంది.

జైలు అధికారుల బదిలీ



జైలు సూపరింటెండెంట్ కిశోర్



అడిషనల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

ఆరిలోవ(విశాఖ): విశాఖ కేంద్ర కారాగారంలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ఏపీ జైళ్ల శాఖ డీజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్ కుమార్‌కు అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు సూపరింటెండెంట్‌గా అటాచ్ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు కేంద్ర కారాగారం అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబును ఎఫ్ఏసీ సూపరింటెండెంట్‌గా ఇక్కడ నియమించారు. ఇక్కడ అడిషనల్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.వెంకటేశ్వరరావును నెల్లూరు కేంద్ర కారాగారానికి బదిలీ చేశారు. అలాగే ఆఫీస్ సూపరింటెండెంట్(పరిపాలన విభాగం) డి.శరత్‌బాబును నెల్లూరు కారాగారం ఆఫీస్ సూపరింటెండెంట్‌గా అటాచ్ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు ఆఫీస్ సూపరింటెండెంట్ వి.అప్పారావును ఇక్కడ నియమించారు. నెల్లూరు కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.సాయి ప్రవీణ్‌ను విశాఖకు బదిలీ చేశారు. విశాఖ కేంద్ర కారాగారంలో ఇటీవల జరిగిన పరిణామాలు ఈ బదిలీలకు కారణంగా పలువురు భావిస్తున్నారు.

గంజాయితో జైలు ఫార్మాసిస్ట్ పట్టుబడటం, రిమాండ్ ఖైదీ జైలు గేటు వద్ద హల్‌చల్ చేయడం, బీడీ కట్టలతో మరో రిమాండ్ ఖైదీ పట్టుబడటం తదితర వ్యవహారాలు ఇటీవల చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో జైళ్ల శాఖ ఉన్నతాధికారులు ఈ జైలుపై ప్రత్యేక దృష్టి పెట్టి..బదిలీలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.



అతివకు అభయమేది ?

- ఆగని వేధింపులు, దౌర్జన్యాలు
- హోంమంత్రి సొంత జిల్లాలో బాలికలపై లైంగిక దాడులు
- కూటమి ప్రభుత్వంలో జిల్లాలో 20 పోక్సో కేసులు నమోదు
- వీటిలో ఒకటి హత్య, 19 లైంగిక వేధింపులు
- రోలుగుంట జేసీ అగ్రహారంలో దివ్యాంగ బాలికపై లైంగిక దాడి
- రాంబిల్లిలో మైనర్ బాలికను హత్య చేసిన ప్రేమోన్మాది
- యలమంచిలిలో 8వ తరగతి బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన బావ
- అనకాపల్లిలో నిద్రిస్తున్న బాలికపై అత్యాచార యత్నం

సాక్షి, అనకాపల్లి:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి మహిళల భద్రతకు కరువైంది. అత్యాచారాలు పెచ్చుమీరిపోయాయి. జిల్లాలో నమోదైన పోక్సో కేసులే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మహిళా హోంమంత్రి సొంత జిల్లాలోనే బాలికలకు, మహిళలకు భద్రత లేకపోతే ..రాష్ట్రంలో అతివల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా అఘాయిత్యాల జరుగుతున్నాయంటూ మహిళా సంఘాల నేతలు దుమ్మెత్తిపోస్తున్నారు. గత ప్రభుత్వంలో మహిళా భద్రతకు దిశ పోలీసు స్టేషన్ల, దిశ యాప్, దిశ కాల్ సెంటర్లు, ప్రతి జిల్లాలోనూ ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశారు. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడాలన్నా..అఘాయిత్యాలకు పాల్పడాలన్నా భయపడేలా ఉండేది. అంతేకాకుండా లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు, అఘాయిత్యాలకు పాల్పడే వారికి ఫాస్ట్ ట్రాక్ కోర్టుల **ద్వారా త్వరితగతిన శిక్షలు కూడా పడేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అకృత్యాలు పెరిగిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 20 పోక్సో కేసులు నమోదయ్యాయి.**

రోలుగుంట మండలం జేపీ అగ్రహారంలో దివ్యాంగురాలైన బాలికపై కాకరదాసు అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసులు జూలై 7న పోక్సో కేసు నమోదు చేశారు. నేరం రుజువుకావడంతో అక్టోబర్ 23న నిందితుడికి 3 ఏళ్ల పాటు జైలు శిక్ష, రూ.30 వేలు జరిమానా విధించారు. ఈ ఒక్క కేసు తప్ప మిగతా అన్ని కేసులు దర్యాప్తులోనే ఉన్నాయి. మహిళలపై దాడులు, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడే మృగాలను కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అభం శుభం తెలియని పసిపాపలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారికి శిక్ష పడితేనే మరొకరు చేయడానికి భయపడతారంటూ మహిళా సంఘాల నేతలు సూచిస్తున్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మహిళల భద్రతపై ఫోకస్ పెట్టి **దిశ యాప్‌ను, దిశ పోలీస్‌స్టేషన్లను మళ్లీ పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.**

జిల్లాలో నమోదైన పోక్సో కేసుల్లో ప్రధానమైనవి..

- జులై 7న రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెంలో 14 ఏళ్ల బాలికపై సురేష్ అనే యువకుడు అత్యాచారం చేసి, హత్యచేశాడు. మరుసటిరోజు సురేష్ ఆత్మహత్య చేసుకున్నాడు.
- అక్టోబర్ 15న యలమంచిలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లైన్‌కొత్తూరులో గల న్యూలైఫ్ హాస్టల్‌లో 9వ తరగతి చదువుతున్న బాలికపై హాస్టల్ కేర్‌టేకర్(వార్డెన్) రావాడ శ్రీను వేధింపులకు పాల్పడ్డాడు.
- అక్టోబర్ 19న అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో కుమారపురం గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన రెడ్డి అశోక్ అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.
- అక్టోబర్ 22న యలమంచిలి టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 8వ తరగతి చదువుతున్న బాలికపై యలమంచిలి పట్టణం సీపీ పేటకు చెందిన బావ బి.వెంకి అత్యాచారానికి పాల్పడ్డాడు.
- అక్టోబర్ 25న నర్సీపట్నం టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 9వ తరగతి చదువుతున్న బాలికపై ఆర్.శివ అనే యువకుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. పోక్సో కేసు నమోదు చేశారు.
- అక్టోబర్ 29న యలమంచిలి పట్టణం రామ్‌నగర్‌లో ఒక వివాహిత తనకు 18 ఏళ్లు నిండకుండా వివాహం చేశారని భర్తపై పోక్సోకేసు పెట్టింది.
- అక్టోబర్ 30వ తేదీన అర్ధరాత్రి అనకాపల్లి గవరపాలెంలో సంతోషిమాత ఆలయ రహదారి సమీపంలో అమ్మమ్మ ఇంటి వద్ద నిద్రిస్తున్న 12 ఏళ్ల బాలికపై 65 ఏళ్ల వృద్ధుడు(యల్లపు శ్రీరామూర్తి) అత్యాచారం చేసేందుకు యత్నించాడు. తల్లిదండ్రులు చనిపోవడంతో అమ్మమ్మ ఇంటిలోనే ఆ బాలిక ఉంటూ చదువుకుంటోంది.

పోలీసులకు ఫిర్యాదు చేయాలి



గంజాయి, మద్యం లాంటి మత్తు పదార్థాలకు బానిసలై బాలికలపై లైంగిక వేధింపులకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. బాలికలపై లైంగిక వేధింపులు, అఘాయిత్యాలకు పాల్పడితే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారికి శిక్ష పడుతుంది. దీనిపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పోలీసులు అవగాహన కల్పించాలి. లైంగిక వేధింపులు, అత్యాచారాలకు పడే శిక్షలపై ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలి.

– కరణం కృష్ణ, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్, విశాఖ పోక్సో కోర్టు

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



జిల్లాలో ప్రతి పాఠశాల, కళాశాలల్లో 'సంకల్పం' పేరిట అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నాం. బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే పడే శిక్షల గురించి వివరిస్తున్నాం. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై కూడా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. లైంగికదాడులే కాదు ఎటువంటి నేరాలకు పాల్పడినా ఎవరినీ ఉపేక్షించేది లేదు. జిల్లాలో ఈ ఏడాదిలో నమోదైన పోక్సో కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి నిందితులకు శిక్ష పడేలా చేస్తాం. లైంగిక దాడులకు పాల్పడితే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. సచివాలయంలోని మహిళ కానిస్టేబుల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. లేదంటే నేరుగా డైల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

– తుహిన్ సిన్హా, ఎస్పీ, అనకాపల్లి

ముసురుకున్న 'ఫెంగల్'

- తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు
- పలు చోట్ల నేలకొరిగిన వరి చేను
- పంటను రక్షించుకునే పనిలో రైతులు నిమగ్నం



కొండల అగ్రహారంలో నీట మునిగిన వరిచేను

సాక్షి, అనకాపల్లి/తుమ్మపాల: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కురిశాయి. ముసురు వాతావరణం నెలకొంది. నక్కపల్లి, చోడవరం, చీడికాడ, గొలుగొండ, మాడుగుల మండలాల్లో భారీగా ఈదురు గాలులు వీచాయి. దీంతో రెండు వేల ఎకరాల్లో పండిన వరి పంట నేలకు ఒరిగింది. శనివారం తెల్లవారు జామునుంచి ఈదురుగాలులతో తేలికపాటి వర్షం కురుస్తూనే ఉంది. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ వరి విస్తీర్ణం 58వేల హెక్టార్లు కాగా, ఇప్పటికే 25శాతం వరి కోతలు పూర్తయ్యాయి. పంటను రక్షించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కిమీ వేగంతో గాలులు వీస్తున్నాయి. సాధారణం కంటే ఒక మీటరు ఎక్కువ ఎత్తులో అలలు ఎగసి పడుతున్నాయి. డిసెంబర్ 2 వరకూ మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని, సందర్శకులు సముద్రంలో దిగేందుకు ప్రయత్నించ వద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. జిల్లాలో అత్యధికంగా యలమంచిలి మండలంలో 18.8 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా దేవరాపల్లి మండలం 1.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

వర్షపాతం వివరాలు ...

మండలం	వర్షపాతం (మి.మీ)	మండలం	వర్షపాతం (మి.మీ)
యలమంచిలి	18.8	మాడుగుల	11.8
రాంబిల్లి	18.6	కశింకోట	11.8
బుచ్చెయ్యపేట	16.4	నాతవరం	10.4
పరవాడ	16.2	రావికమతం	10.4
నర్సీపట్నం	15.8	సబ్బవరం	9.2
అచ్యుతాపురం	15.2	పాయకరావుపేట	9.2
మునగపాక	14.4	అనకాపల్లి	8.4
నక్కపల్లి	14.2	కోటవురట్ల	8.4
ఎస్.రాయవరం	13.2	రోలుగుంట	8.2
గొలుగొండ	12.4	చీడికాడ	6.2
మాకవరపాలెం	12.0	కె.కోటపాడు	3.4
		చోడవరం	2.0
		దేవరాపల్లి	1.8

మోసాలకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్

- బాబు ష్యూరిటీ...పేద ప్రజలపై బీర బాదుడుకు గ్యారంటీ
- ఆరు నెలల్లో రెండు సార్లు రూ.15,485 కోట్ల ట్రూఅప్ చార్జీల వడ్డన
- పాలనలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ధ్వజం



దేవరాపల్లి: మోసాలకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌అని, మాయమాటలతో నిరంతరం ప్రజ లను మోసగిస్తూనే ఉన్నారని, అందులో ఆయనకు మరొకరు సాటి రారని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయు డు విమర్శించారు. మండలంలోని తారువలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన మార్కు నయ వంచనతో హామీలకు తూట్లు పొడుస్తూ మరోమారు ప్రజల నడ్డి విరిచేందుకు సిద్ధపడటం దుర్మార్గమన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో చార్జీలు తగ్గిస్తానని, విద్యుత్ చార్జీలు పెంచబోనని, ట్రూఅప్ చార్జీలు సైతం ఎత్తి వేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు తాను ఏ హామీ ఇవ్వలేదని ఇప్పుడు నిస్సిగ్గుగా బుకాయించారని చెప్పారు. ఎన్నికల సమయంలో బాబు చెప్పిన ష్యూరిటీ ఏమోగాని, ప్రజలకు బాదుడు గ్యారంటీ అన్నట్లుగా రాష్ట్రంలో పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే ఎడా పెడా కరెంట్ చార్జీలతో బీర బాదుడుకు శ్రీకారం చుట్టి, 5 నెలల్లోనే రెండో సారి ట్రూఅప్ చార్జీల భారం మోపడం అత్యంత దారుణమని మండిపడ్డారు. తాజాగా రూ.9,412.50 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రభుత్వం వసూలు చేయనుందని, డిసెంబర్‌లో వినియోగించే విద్యుత్‌కు యూనిట్‌కు రూ.0.92 చొప్పున ప్రభుత్వం జనవరిలో ఈ చార్జీలు వసూలు చేస్తుందన్నారు. ఈ ఏడాది దీపావళికి రాష్ట్ర ప్రజలపై రూ. 6,072.86 కోట్ల భారం మోపగా, తాజాగా పెంచిన చార్జీలతో కలిపి జనవరి నుంచి యూనిట్‌కు రూ. 2.19అదనంగా వినియోగదారులు చెల్లించాలన్నారు.ఐదు నెలల పాలనలో రూ.15,485.36 కోట్ల భారాన్ని కూటమి ప్రజలపై మోపిందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలపై ఎల్లో మీడియా, చంద్రబాబు అదే పనిగా దుష్ప్రచారం చేశారని తెలిపారు. కూటమి పాలనలో స్కూల్, కాలేజీ ఫీజులు, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఉచితంగా ఇస్తామన్న ఇసుక రేట్లు, తగ్గిస్తామన్న లిక్కర్ ధరలు, రిజిస్ట్రేషన్ చార్జీలు సైతం బాగా పెరిగిపోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో సామాన్యుడు బతికే పరిస్థితి కనిపించడం లేదని, పాలనలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ధ్వజమెత్తారు.

మళ్లీ కమ్మేస్తున్న మహమ్మారి

- జిల్లాలో చాపకిందనీరులా విస్తరిస్తున్న హెచ్ఐవీ/ఎయిడ్స్
- బాధితుల్లో యువకులు, మధ్య వయస్కులే అధికం
- క్రమశిక్షణతో జీవిస్తే ఆయుష్షు పెంచుకోవచ్చు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం

యలమంచిలి పట్టణానికి చెందిన ఒక ప్రైవేటు కళాశాల అధ్యాపకునికి హెచ్ఐవీ సోకింది. ఈ విషయాన్ని దాచిపెట్టిన అతడు పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకున్నాడు.రెండేళ్లు గడుస్తున్నా భార్యతో లైంగికంగా కలిసేందుకు ఇష్టపడలేదు.అసలు సమస్య ఏమిటో తెలియక రెండు కుటుంబాల వారు తలలు పట్టుకున్నారు.అనుమానం వచ్చిన భార్య తరఫువారు బలవంతంగా రక్త పరీక్ష చేయించడంతో హెచ్ఐవీ సోకినట్టు నిర్ధారణ అయింది.హెచ్ఐవీ ఉందని తెలిసినా వివాహం ఎందుకు చేసుకున్నావని నిలదీసినా ఫలితం లేకపోయింది.పెద్దల మధ్య అంగీకారంతో వారిద్దరూ విడిపోయారు.ఆ తర్వాత ఆ అధ్యాపకుడు ప్రియురాలితో కలిసి విదేశాలకు వెళ్లిపోయాడు.





అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో ఏఆర్‌టీ సెంటర్

అచ్యుతాపురంలో ప్రసవ సమయంలో తల్లి నుంచి ఓ బాలికకు హెచ్ఐవీ సోకింది.కొంత కాలానికి తల్లి ఎయిడ్స్‌తో మరణించింది. తండ్రి నిరుపేద. కూలి పనులు చేసుకుంటూ కుమార్తెను చదివిస్తున్నాడు. ఓ ప్రై వేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఆమె ప్రతి నెలా అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం ఏఆర్‌టీ కేంద్రం ద్వారా మందులు తీసుకుంటోంది. ఇటీవల ఒక యువకుడ్ని ప్రేమించింది.అతడ్ని వివాహం చేసుకుంది.ప్రేమ వ్యామోహంలో ఆ యువకుడు కూడా హెచ్ఐవీ బారిన పడ్డాడు.

రాంబిల్లి మండలానికి చెందిన ఓ భూస్వామి చిన్నకుమారుడు ఉత్సవాల సమయంలో గ్రామంలో కొందరు యువకులతో మద్యం మత్తులో ఓ రికార్డింగ్ డ్యాన్సర్‌తో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఊహించని విధంగా హెచ్ఐవీ సోకింది.వివాహమైన తర్వాత భార్య కూడా వైరస్ బారిన పడడంతో మందులు వాడుతున్నారు. చూపు కోల్పోయిన యువకుడు కొద్దిరోజుల క్రితం మృతిచెందాడు.

నక్కపల్లికి చెందిన 22 **ఏళ్ల యువ**కుడు ఇటీవల జ్వరం,క**డుపునొ**ప్పితో ఆస్పత్రికి వెళ్లినపు**డు వైద్య** పరీక్షలు నిర్వహించారు.**అతడికి** హెచ్ఐవీ ఉన్నట్టు బయట**పడిం**ది.ఆరు నెలల క్రితం ట్రా**న్స్‌జెం**డర్‌తో జరిపిన లైంగిక **సంపర్కం** కారణంగానే హెచ్ఐవీ **సోకినట్టు** గుర్తుతెచ్చుకుని లబో**దిబోమంటూ** రోదించాడు.ఆ మరుసటి **రోజే** ఆత్మహత్య చేసుకున్నాడు.



ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఇచ్చే మందు

యలమంచిలి రూరల్: ఎయిడ్స్ ఈ పేరు వింటేనే పలువురు జడిసిపోతుంటారు. ఇప్పుడు ఈ ప్రాణాంతక వ్యాధి జిల్లాలో చాపకింద నీరులా విస్తరిస్తోంది.అరక్షిత శృంగారం హెచ్ఐవీ/ఎయిడ్స్ సంక్రమించేందుకు ప్రధాన కారణమవుతోంది. భాగస్వామితో కాకుండా ఇతరులతో శారీరకంగా కలవడం,సురక్షిత పద్ధతులు పాటించక పోవడంతో చాలా మంది దీని బారిన పడుతున్నారు. జిల్లాలో ఇటీవల ఈ బాధితుల్లో ఎక్కువమంది 20 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయసువారే అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది.సురక్షితం కాని వివాహేతర సంబంధాలు,స్వలింగ సంపర్కులు తదితరుల ద్వారా వ్యాధి విస్తరిస్తోంది. జిల్లాలో ఎక్కువ మంది బాధితులు అనకాపల్లి,యలమంచిలి, చోడవరం, నర్సీపట్నం,పాయకరావుపేట,అచ్యుతాపురం,నక్కపల్లి సహా మండల కేంద్రాలు,కొన్ని మేజర్ పంచాయతీల్లో ఉన్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ఈ వ్యాధి నివారణలో భాగంగా 1988 డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రభుత్వాలు,వివిధ స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. ఈ వ్యాధి విస్తరించడానికి వలసదారులు, ట్రక్కర్స్,యువత, ట్రాన్స్ జెండర్లు, వితంతువులు,అనాథలు కారణమవుతున్నట్టు గుర్తించారు. ముఖ్యంగా కొందరు యువకుల నిర్లక్ష్యం కారణంగా వారితో పాటు కుటుంబ సభ్యుల జీవితాలను మహమ్మారి కబళిస్తోంది.డిన్నర్లు,పార్టీల పేరుతో విచ్చలవిడిగా తిరగడం ,మద్యం మత్తులో సురక్షితం కాని శృంగారానికి పాల్పడ్డం,మొబైల్ యాప్‌ల ద్వారా ఆకర్షణతో పెడదారి పట్టడం, హైవే పక్కన వ్యభిచార మహిళలతో అరక్షిత లైంగిక కార్యకలాపాల వల్ల వ్యాధి బారిన పడి జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు.



యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో హెచ్ఐవీ పరీక్షలకోసం సేకరించిన రక్త నమూనాలు

ప్రతి నెలా 20 నుంచి 30 పాజిటివ్ కేసులు

జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేట్, ఏఆర్‌టీ,మొబైల్ నెట్‌వర్క్,నర్సింగ్ హోమ్,బ్లడ్ బ్యాంక్‌లు తదితర కేంద్రాల్లో నిర్వహిస్తున్న హెచ్ఐవీ పరీక్షల్లో ప్రతి నెలా 20 నుంచి 30 వరకు పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయని సమాచారం.జిల్లా వైద్యశాలలోని ఏఆర్‌టీ కేంద్రంలో అధికారికంగా 7,615 మంది హెచ్ఐవీ బాధితులు నమోదై ఉన్నారు.వీరిలో 2,996 మంది పురుషులు,4,348 మంది మహిళలు,134 మంది మగ పిల్లలు,129 మంది ఆడ పిల్లలు,8 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.వీరు కాకుండా విశాఖపట్నం,తుని,కాకినాడ, రాజమండ్రి,విజయవాడకు వెళ్లి చికిత్స చేయించుకునే వారి సంఖ్య మరో 3 వేల మంది వరకు ఉండొచ్చని అంచనా.హెచ్ఐవీ సోకిన పలువురు ఆ విషయం బయటపడకుండా ఉంటూ సురక్షితం కాని లైంగిక చర్యలతో మరికొందరికి సోకేందుకు కారణమవుతున్నారు.వ్యాధిబారిన పడినవారి వివరాలను పరిశీలిస్తే హెచ్ఐవీ శరవేగంగా చాప కింద నీరులా పలువురి ప్రాణాలను బలిగొంటోంది.గత దశాబ్దంతో పోలిస్తే ప్రస్తుతం కేసుల సంఖ్య కాస్త తగ్గుముఖం పడుతున్నట్టు కనిపిస్తున్నా అనుకున్న విధంగా పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడలేదు.బాధితుల్లో చిన్నారులు కూడా ఉండటం బాధ కలిగించే విషయం.

జిల్లాలో ఇలా..

సంవత్సరం	పరీక్ష చేయించుకున్న గర్భిణులు	పాజిటివ్	జనరల్ పరీక్షలు	పాజిటివ్
2022-23	31,055	18	47,048	429
2023-24	27,902	11	51,881	336
2024 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు	17,086	8	40,601	198

జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులు **7,615**

వీరిలో చిన్నారులు **263**

జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులకు సహాయం కోసం..

ఏఆర్‌టీ కేంద్రాలు	ఏఆర్‌టీ ప్లస్ కేంద్రాలు	లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు
అనకాపల్లి,నర్సీపట్నం ఆస్పత్రులు	చోడవరం, నక్కపల్లి, కోటవురట్ల	కె. కోటపాడు,మాడుగుల, యలమంచిలి,సబ్బవరం

హెచ్ఐవీని ఇలా నిర్ధారించవచ్చు

హెచ్ఐవీ వైరస్ వృద్ధితో కొంతకాలానికి ఎయిడ్స్ వ్యాధి బారిన పడతారు. దీనిని మొట్టమొదటి సారిగా యూఎస్ఏలోకనుగొన్నారు. హెచ్ఐవీ (హ్యూమన్ ఇమ్యునో డెఫిసియన్సీ వైరస్) గుర్తించడానికి పరీక్ష కేంద్రాల్లో కాంబెడ్స్,ట్రై లైన్,ట్రిస్పాట్ పరీక్షలను నిర్వహించి వాటిలో పాజిటివ్ వచ్చినట్టయితే హెచ్ఐవీగా నిర్ధారిస్తారు. సీడీ 4 కౌంట్ టెస్టులో తెల్లరక్తకణాల సంఖ్య 350 కంటే తక్కువగా ఉంటే వారికి జీవితకాలం పాటు ఉచితంగా మందులను అందిస్తున్నారు.దీర్ఘకాల విరోచనాలు,జ్వరం,ఎడతెరిపి లేని దగ్గు,చర్మ వ్యాధులు,గొంతు నొప్పి ఎక్కువ రోజులు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి.నెల రోజుల్లో శరీర బరువులో 10 శాతం తగ్గినా,నెల రోజులకు మించి జ్వరం,విరోచనాలు ఉన్నా వెంటనే పరీక్షలు చేయించుకోవాలి.

వ్యాధి ఉన్నా ఆరోగ్యంగానే..

ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారికి ఏఆర్‌టీ(ఏంటీ **రిట్రో వైరల్)**కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. **వ్యాధిగ్రస్తుల్లో** ఆత్మస్థైర్యాన్ని నింపేలా కౌన్సెలిం**గ్‌ను ఇవ్వడంతో** పాటు అవసరమైన మందులను **అందిస్తున్నాయి**.జిల్లాలో ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా **7,615 మంది** మందులు తీసుకుంటున్నారు.వీరిలో **80 శాతం మం**ది వైరల్ లోడ్ టెస్టులు చేయించుకుం**టున్నారు.ఇలా** వైరల్ లోడ్ టెస్టులు చేయించుకుని, **సరైన పౌష్టికాహా**రం తీసుకోవడం ద్వారా 90 శాతం **మందికి హెచ్**ఐవీ ఉన్నా ఆరోగ్యంగానే ఉంటున్నా**రు. హెచ్ఐవీ** వచ్చాక బాధపడేకన్నా దాని బారిన **పడకుండా చూ**సుకోవాలనేలా స్వచ్ఛంద సంస్థల **ప్రతినిధులు,వైద్యు**లు సూచిస్తున్నారు.ముందు **జాగ్రత్తనే అసలై**న మందు అనే విషయాన్ని వివరి**స్తున్నారు.వ్యాధి**గ్రస్తులకు ప్రతి నెలా ఏఆర్‌టీ, **ఏఆర్‌టీ ప్లస్**,లింక్ ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా జీవితకాలాన్ని పెంచే మాత్రలు ఉచితంగా అందజేస్తున్నారు.

చైతన్యవంతం కావాలి



హెచ్ఐవీ పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి.మంచి అలవాట్లు,నడవడికతో హెచ్ఐవీ/ఎయిడ్స్‌కు అడ్డుకట్ట వేయవచ్చు.ఈ వ్యాధికి సంబంధించి ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలి.హెచ్ఐవీ నివారణకు చర్యలు చేపడుతున్నాం.హెచ్ఐవీ బాధితులకు ఉచితంగా మందులు అందిస్తున్నాం.వీటిని నిర్దిష్ట సమయంలో వేసుకుంటూ ఈ వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు.వ్యాధి నియంత్రణతో పాటు ఆయుష్షును పెంచుకుని జీవించవచ్చు.

– ఎం.ఎస్.వి.కె. బాలాజీ, డీఎంహెచ్‌వో,జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ అధికారి.

క్లుప్తంగా

యువజనోత్సవాల నిర్వహణ అభినందనీయం


మాట్లాడుతున్న పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పాయకరావుపేట: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. తుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 25 నుంచి 29 వరకు యువజనోత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాల్లో విజేతలైన 500 మందికి పట్టణంలోని సాయి ఉత్సవ్‌లో శనివారం బహుమతుల ప్రదానం జరిగింది. 14 విభాగాల్లో విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలను కొనియాడారు.

జుజిట్సు జిల్లా అధ్యక్షుడుగా ప్రసాద్



నర్సీపట్నం: జుజిట్సు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నర్సీపట్నానికి చెందిన కరాటే కోచ్ ఆర్.ప్రసాద్ నియమితులయ్యారు. ప్రసాద్‌ను నియమిస్తూ అసోసియేషన్ స్టేట్ అధ్యక్షులు యాసిన్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేస్తానని చెప్పారు.

చి'వరి' దశలో ఫెంగల్ అలజడి

- వర్షం, ఈదురు గాలులకు ఒరిగిన వరిపైరు
- పంటను కాపాడుకునే పనిలో రైతులు బిజీ
- కుప్పలు పెట్టి, టార్పాలు కప్పి సంరక్షణ


కుప్ప పెట్టడానికి పొలాల నుంచి వరి చేలు తరలిస్తున్న రైతులు


వరి కుప్పలను టార్పాలతో కప్పుతున్న రైతు

చోడవరం: ఫెంగల్ తుపాను హెచ్చరికలతో రైతుల్లో అలజడి రేగుతోంది. చేతికి అందివచ్చిన పంటను రక్షించుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. చివరి దశకు చేరుకున్న వరి పంటకు రెండ్రోజులుగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండగా.. ఆది, సోమవారాల్లో భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు, అలా అని పెద్ద తుపాన్లు కూడా రాకపోవడంతో పంట ఆశాజనకంగా ఉంది. ఇప్పటికే వరి కోతలు కూడా చాలా చోట్ల జోరుగా సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తుపాను హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ వరి విస్తీర్ణం 58 వేల హెక్టార్లు. ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో అన్ని మండలాల్లోనూ వరి పంట వేశారు. ప్రధానంగా చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, యలమంచిలి, పాయకరావుపేట, పాడేరు నియోజకవర్గాల్లో ఎక్కువగా సాగైంది. ఇప్పటికే 25 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోనే ఈ ఏడాది 54 వేల ఎకరాల్లో వరి పంట వేశారు. సకాలంలో వరినాట్లు వేయడంతో పంట పూర్తిగా కోతకు వచ్చింది. తేలిక రకాలు ఇప్పటికే కోతలు కోసి కుప్పలు వేయగా.. ఆర్‌జీఎల్, సోనామసూరి, సాంబమసూరి, సూపర్ జయ వంటి రకాలు ఇప్పుడు కోత దశకు వచ్చాయి. ఈ పరిస్థితిలో తుపాను హెచ్చరికలతో కోసేసిన వరిపైరును కుప్పలు పెట్టేందుకు సన్నద్ధమయ్యారు. శనివారం తెల్లవారు జాము నుంచి ఈదురుగాలులతో తేలికపాటి వర్షం కురుస్తూనే ఉంది. ఈ వర్షాలు మరింత ఎక్కువైతే పూర్తిగా పంట పొలంలోనే నష్టపోవాల్సిందే. మరో పక్క కోతకు వచ్చిన పంటను హడావిడిగా కోత కోస్తున్నారు. ఒక వేళ వర్షాలు భారీగా కురిస్తే పంట పూర్తిగా నేలకొరిగి, నీట మునిగి నష్టాలపాలవుతుందని ఆందోళన చెందుతున్న రైతులు.. గింజకట్టి మరో వారం రోజుల్లో కోయాల్సిన పంటను సైతం ఇప్పుడే కోసేస్తున్నారు. ఎవరి పంట వారు రక్షించుకునే పనిలో పడ్డారు. వరి కుప్పలు తడిసిపోకుండా టార్పాలతో కప్పుతున్నారు.

98 మద్యం బాటిళ్లు స్వాధీనం

నర్సీపట్నం: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ స్పెషల్ పార్టీ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ కె.సునీల్ కుమార్ తెలిపారు. రోలుగుంట మండలం భోగాపురానికి చెందిన సత్యనారాయణ నుంచి 49 బాటిళ్లు, వడ్డిప శరభవరానికి చెందిన ఎం.రవి నుంచి 49 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చెప్పారు. మొత్తం 98 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి: గవరపాలెం ముత్రాస్ కాలనీకి చెందిన యాదల గోపీగణేష్ పాన్‌షాప్‌లోంచి 20 మద్యం బ్యాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ హెచ్‌సీ శ్రీనివాసరావు శనివారం చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

కశింకోట: మండలంలోని బయ్యవరంలో అక్రమంగా తరలిస్తున్న పది క్వార్టర్ మద్యం సీసాలను శనివారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. నిందితుడు గొర్లి రామును అరెస్టు చేసినట్టు ఆయన చెప్పారు.

రెండో వివాహానికి బ్రేక్

- న్యాయమూర్తి తాత్కాలిక ఉత్తర్వులు

విశాఖ లీగల్: మొదటి భార్యతో విడాకులు తీసుకోకుండా రెండో వివాహానికి సిద్ధమైన వ్యక్తికి న్యాయస్థానం షాక్ ఇచ్చింది. ఈనెల 5న జరగాల్సిన వివాహానికి తాత్కాలికంగా బ్రేక్ వేసింది. గాజువాక చినగంట్యాడ దిబ్బపాలెనికి చెందిన కంటుముచ్చు పావని అదే ప్రాంతానికి చెందిన కదిరి సతీష్‌కుమార్ సమీప బంధువులు. మేనత్త మేనమామ పిల్లలు. ఈ నేపథ్యంలో ఇద్దరు వివాహం చేసుకోవాలని నిర్ణయించారు. పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో గతేడాది జనవరి 20న సింహాచలంలో వివాహం చేసుకున్నారు. పావని కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు ఇష్టపడి వివాహం చేసుకున్నామని పోలీసులకు చెప్పగా ఇరుపక్షాలను రాజీ చేసి పంపించేశారు. రాజీ ప్రకారం మంచి ముహూర్తంలో పావనిని తీసుకొని వెళ్తామని అంగీకరించిన సతీష్‌కుమార్, కుటుంబ సభ్యులు కట్నం, కానుకల కోసం గొడవ పెట్టి ఆమెను పుట్టింట్లోనే వదిలేశారు. పోలీసు కేసుకు భయపడి తన భార్యను కాపురానికి పంపమని సతీష్‌కుమార్ 2023లోనే అదనపు కుటుంబ న్యాయస్థానంలో కేసు దాఖలు చేశారు. దావా విచారణలో ఉండగా, తామిద్దరం కేసు రాజీ చేసుకున్నామని సతీష్‌కుమార్ పేర్కొన్నారు. 2024 సెప్టెంబర్ 19వ దావాను విరమించుకున్నారు. ఇది ఇలా ఉండగా సతీష్‌కుమార్, అతని కుటుంబ సభ్యులు అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడ నరసాపురానికి చెందిన గనగళ్ల రాజేశ్వరితో వివాహం ఒప్పందం కుదుర్చుకున్నారు. నవంబర్ 16న ప్రధానం చేసుకున్నారు. ఈనెల 5న పెళ్లి జరిపేందుకు ముహూర్తం పెట్టారు. విషయం తెలుసుకున్న బాధితురాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పావని తరపు వాదనలు విన్న ప్రధాన కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధారత్నం వివాహాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ, సతీష్‌కుమార్, రాజేశ్వరిలు ఈనెల 3న హాజరుకావాలని నోటీసు జారీ చేశారు.

అనంతుని లోగిలి దీపకాంతుల సిరి


దీపారాధనలో మహిళలు


దీపారాధన కోసం అనంత పద్మనాభుని కొండ మెట్ల వద్ద నిరీక్షిస్తున్న భక్తులు


దీపోత్సవంలో భక్తుల సందడి

పద్మనాభం: రాష్ట్రంలో విశిష్టతను సంతరించుకున్న అనంత పద్మనాభుని దీపోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. తైల దీపాలు వెదజల్లిన సింధూర వర్ణపు కాంతులతో అనంత పద్మనాభుని గిరి దేదీప్యమానంగా వెలుగొందింది. అనంతుని దీపోత్సవ దీప్తి దశ దిశలా వ్యాపించి భక్తులకు ఆధ్యాత్మిక పారవశ్యాన్ని కల్పించింది. గిరి శిఖరంపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి, గిరి దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయాల్లో తెల్లవారు జాము నుంచే విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటల నుంచే భక్తుల రావడం ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటలకు పద్మనాభం రోడ్లన్నీ భక్త జన సందోహంతో నిండిపోయాయి. తుపాన్ ప్రభావం వల్ల వర్షం కురిసినా పరిసర ప్రాంతాల నుంచే కాకుండా శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చిన భక్తులు అనంతుని పాద సన్నిధిలో దీపారాధన చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన అనంత పద్మనాభస్వామి చిన్న ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై వేద పండితుల వేద మంత్రోచ్ఛరణలు, నాద మునీశ్వరుల నాద స్వరాల నడుమ తొలి పావంచా వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి పావంచా వద్ద కొలువు దీరిన స్వామిని భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం 5.30 గంటలకు జేగంట మోగగానే భక్తులు 1,200 మెట్లు కిరువైపులా తైల దీపాలు వెలిగించారు. తైల దీపాలంకరణతో అనంత పద్మనాభుని గిరికి సింధూర తోరణాలు అద్దినట్టు సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన చిడతలు, తప్పెటగుళ్లు, పులివేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

- పేద ప్రజలపై సర్దుబాటు పేరిట భారం మోపడం దారుణం
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న డిమాండ్



దేవరాపల్లి: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును కూటమి ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 2023–2024 సంవత్సరానికి సంబంధించి రూ.9,412 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీల వసూలుకు ఈఆర్‌సీ అంగీకరించడం అత్యంత దారుణమన్నారు. డిసెంబర్ ఒకటి నుంచి యూనిట్‌కు 92 పైసలు చొప్పున వసూలు చేసి, రూ.7,912 కోట్ల మేర ప్రజలపై భారం మోపడం దుర్మార్గమని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇలా ప్రజలను నమ్మించి మోసగించడం అన్యాయమన్నారు. నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర, కూలీ రేట్లు మాత్రం పెరగలేదని చెప్పారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రభుత్వం వేగవంతం చేసిందని, రానున్న రోజుల్లో సెల్, టీవీ డిస్ మాదిరిగా రీచార్జ్ చేసుకోవాల్సి వస్తుందన్నారు. ఈ మీటర్ల ఖరీదును సైతం బిల్లుతో వాయిదా పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుందని సీపీఎం నేత వెంకన్న చెప్పారు. విద్యుత్ చార్జీల పెరుగుదలతో ప్రజలపై మరింత భారాలు పడటం ఖాయమన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

ఎవరి ఒత్తిడితో భవనం కూల్చారు?

- టౌన్ ప్లానింగ్ అధికారిని నిలదీసిన మున్సిపల్ వైస్ చైర్మన్
- వాడీవేడిగా నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, కూటమి కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: కోర్టు ఆదేశించిన భవనాన్ని వదిలేసి, కోర్టు విచారణలో ఉన్న బిల్డింగ్‌ను ఎందుకు కూల్చారని మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణను నిలదీశారు. కోర్టు విచారణలో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు భవనాన్ని కూల్చడం సరికాదని, ఎవరు మెప్పు కోసం ఇలా చేశారని ప్రశ్నించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇవ్వాలని చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం జరిగింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడిగా చర్చ నడిసింది. గత నాయకుల అసమర్థత వల్లనే అభివృద్ధి కుంటుపడిందని కూటమి సభ్యులు సిహెచ్.పద్మావతి, సౌజన్య పేర్కొనడంపై మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి అభ్యంతరం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మిమ్మల్ని ప్రజలు పక్కన కూర్చోబెడతారన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. దీంతో అధికార, ప్రతిపక్షం కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఉత్తర వాహినిలో తాత్కాలిక పనులకు లక్షల రూపాయలు వృథా చేయకుండా శాశ్వత పనులు చేపట్టాలని జనసేన కౌన్సిలర్ సౌజన్య అధికారులకు సూచించారు. వీధిలైట్లను ప్రధాన జంక్షన్లలో కూడా వేయాలని వైస్ చైర్మన్ రామకృష్ణ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ జంపా సురేంద్ర, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి


గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటిస్తున్న వైఎస్సార్‌సీపీ, టీడీపీ మండల అధ్యక్షులు


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: గురజాడ జన్మస్థలమైన ఎస్.రాయవరంలో గురజాడ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ, టీడీపీ మండల అధ్యక్షులు బొలిశెట్టి గోవిందరావు, అమలకంటి అబద్ధం కోరారు. గురజాడ వర్ధంతి సందర్భంగా శనివారం ఎస్.రాయవరంలోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురజాడ రచనలు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాయకరావుపేట బృందం కోలాటం, యలమంచిలి కళాకారుల భరతనాట్యం అలరించాయి. విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, గురజాడ రచనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూపతి అప్పారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్ఐ విభీషణరావు, గురజాడ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి వెంకటేశ్వరరావు, కందుల వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు కొణతాల శ్రీనివాసరావు, లక్కోజు ఆదిమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అడవి పంది దాడిలో మరణిస్తే రూ.5 లక్షలు పరిహారం

- నాగేశ్వరరావు మృతిపై పోలీసులు, వైద్యులు నిర్ధారించాలి
- నాతవరం మండలం అటవీ సెక్షన్ అధికారి చిరంజీవి



నాతవరం: అడవి పంది దాడిలోనే మరణించినట్లుగా వైద్యులు, పోలీసుల నుంచి నివేదిక వస్తే ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు పరిహారం అందిస్తామని నాతవరం అటవీ శాఖ సెక్షన్ అధికారి చిరంజీవి తెలిపారు. ఇటీవల మండలంలో శృంగవరం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి జి.నాగేశ్వరరావు అడవి పంది దాడిలో మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో అడవి పందులు సంచరించే పెడిమికొండ అటవీ ప్రాంతంలో శనివారం ఆయన తన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి జంతువుల దాడిలో మరణించిన వారి కుటుంబాలను అటవీ శాఖ ద్వారా ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. ఇప్పటివరకు అడవి జంతువుల దాడిలో మరణిస్తే రూ.5లక్షలు ఇచ్చేవారని, ప్రస్తుతం దానిని ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచిందని, అయితే ఇంకా అధికారికంగా ఆదేశాలు రాలేదన్నారు. నాగేశ్వరరావు అడవి పంది దాడిలో లేక ఏదైన కారణంగా మరణించాడన్న విషయాన్ని పోలీసులు, వైద్యాధికారులు నిర్ధారించాలన్నారు. ఆ నివేదిక ప్రకారం బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తామన్నారు.

వరిలో రెల్ల రాల్చు పురుగుపై అప్రమత్తత అవసరం

అనకాపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో రెల్ల రాల్చు పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు పొలానికి ముందుగా నీరు పెట్టి క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ, వేప నూనె 5.0 మి.లీ లీటరు నీటిలో సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోసిన పంటపై పురుగు ఆశిస్తే 1500 పీపీఎం వేపనూనెను లీటరు నీటికి 5 మి.లీ చొప్పున కలిపి పనలపైన, పనలు తిప్పి పిచికారీ చేయాలన్నారు. వరి కోత దశలో ఉన్నా వర్ష సూచన కారణంగా కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. ఇప్పటికే పైరును కోసి ఉంటే కుప్పలుగా పెట్టుకుని టార్పలిన్ కప్పాలని సూచించారు. బెల్లం తయారీ రైతులు పంచదార శాతం కింది కణుపులలో ఎక్కువగా ఉంటుందని, కాబట్టి చెరకును నేలకు దగ్గరగా నరకాలని, చెరకు నరకిన 24 గంటలలోపు బెల్లం ఆడుకోవాలన్నారు. రబీలో వేరుశనగ వేసే రైతులు అధిక దిగుబడినిచ్చే మేలైన రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఇమిడాక్లోప్రిడ్ 2 మి.లీ, 4 మి.లీల నీళ్ల కిలో విత్తనానికి కలిపిన తరువాత టెబుకొనజోల్ 2 శాతం డీఎస్‌ను కిలో విత్తనానికి 1 గ్రా. చొప్పున కలిపి విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలన్నారు. దుక్కిలో 18 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 35 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలని ఆయన సూచించారు. పేను విత్తిన 3 రోజులలోపు ఎకరానికి ఒక లీటరు పెండిమితలిన్‌ను పిచికారీ చేసి కలుపును నివారించవచ్చన్నారు.

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం ముగింపును పురస్కరించుకుని శనివారం స్వామిని వజ్ర కవచాలంకృతులను చేశారు. రకరకాల పూలమాలలు, తులసి మాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చనలు చేశారు. సాయంత్రం ఆకాశ దీపాలు వెలిగించారు. రాత్రి నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావంతో చిరుజల్లులు

తుమ్మపాల: తుపాను ప్రభావంతో మండలంలో శనివారం రోజంతా చిరుజల్లులతో కూడిన చిన్న పాటి వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 8.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రభుత్వ హెచ్చరికలతో వరి రైతులు అప్రమత్తమై కోతలు నిలిపివేసారు. పెనుగాలులు లేకపోవడంతో వరి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. చిరుజల్లులతో వాతవరణం చల్లబడి చలిగాలులు వీచాయి. బొబ్బర్లు, మినుములు వంటి పంటలకు చిరుజల్లులు కాస్త ఉపశమనం కలిగించాయి. సాయంత్రానికి వాన జల్లుల తగ్గడంతో తుపాను బలహీనపడిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల గ్రామానికి చెందిన 19 సంవత్సరాల యువతి అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు కథనం మేరకు యువతి అచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీలో విధులు నిర్వహిస్తుందని, శుక్రవారం ఇంటి నుంచి కంపెనీకి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదన్నారు. దీంతో యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 2,588 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,510
మొదటి రకం	3,230	3,950
రెండో రకం	2,840	3,730
మూడోరకం	2,790	3,110

అనకాపల్లి సినిమాలు

జీబ్రా	: రాజా
మందిర	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మెకానిక్ రాకీ	: షిర్డిసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
దేవకీనందన వాసుదేవ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 30 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-11 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 326 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 264 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

భద్రం బీకేర్‌ఫుల్ బ్రదర్



వాహనదారుడికి బ్రీత్ ఎనలైజ్ చేస్తున్న పోలీసులు



తోటాడ జంక్షన్ వద్ద మైనర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ

- రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక చర్యలు
- హెల్మెట్‌ధారణపై అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- మైనర్లు డ్రైవింగ్ చేస్తే వాహనాల సీజ్
- ఈ ఏడాది నేటి వరకు 23,471 కేసులు నమోదు
- రూ.48.61 లక్షల జరిమానా విధింపు

అనకాపల్లి:

రహదారి ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అనకాపల్లి పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వివిధ పనులపై వచ్చే వాహన చోదకులకు నిత్యం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది పట్టణ పరిధిలో నేటి వరకూ 23,471 కేసులు నమోదు చేసి, రూ.48 లక్షల 61 వేలు జరిమానాలు విధించారు. రహదారి ప్రమాదాల్లో ఎక్కువగా యువత ప్రాణాలు కోల్పోతున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి..

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారికి ఆనుకని పట్టణానికి వచ్చే అన్ని ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇటీవల పిల్లల సరదాలను దృష్టిలో పెట్టుకుని మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మైనర్లు కొత్తగా వాహనాలు నడపుతూ పరిమితికి మించి వేగంగా డ్రైవ్ చేస్తున్నారు. అటువంటి సమయంలో రోడ్డు ప్రమాదాలు జరిగి మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు 18 సంవత్సరాలు పైబడి, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వ్యక్తులు మాత్రమే వాహనాలు నడపాలని సూచిస్తున్నారు. మొదటి సారి మైనర్ వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.535 జరిమానా, రెండోసారి పట్టుబడితే జరిమానాతో పాటు వాహనం సీజ్ చేసి కోర్టులో హాజరు పరుస్తారు.

రహదారులపై వ్యాపారాలు నిర్వహించవద్దు..

క్రిస్మస్, సంక్రాంతిని పురస్కరించుకుని చిరు వ్యాపారులు రహదారులపై వ్యాపారాలు నిర్వహించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, వారికి ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రానున్న రెండు మాసాల్లో పట్టణ పరిధిలో కుంచావారి వీధి, వేల్పులవీధిలో వ్యాపారులకు అవగాహన కల్పించారు. గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి భారీ ఉత్సవాలు జరుగుతాయని, ట్రాఫిక్‌కు అంతరాయం కాకుండా ఏర్పాట్లు చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు నిర్వాహకులకు సూచించారు.

షాపింగ్‌మాల్స్, స్కూల్స్..

పట్టణ పరిధిలో పెద్దపెద్ద షాపింగ్ మాల్స్, స్కూల్స్ ఉండడంతో గ్రామీణ ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఆటోలు, బస్‌లపై ఎక్కువగా పట్టణానికి వచ్చేవారంతా, ప్రస్తుతం ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ప్రమాదాలు కూడా అధికమయ్యాయి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేయడం వల్ల సమయం కలిసి వస్తుందని అన్ని వర్గాల ప్రజలు భావిస్తున్నారు. పట్టణ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో పార్కింగ్ సమస్య ఉండడంతో నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. రానున్న రెండు మాసాలు క్రిస్మస్, కొత్త సంవత్సర వేడుకలు, సంక్రాంతి, గ్రామ దేవతల పండగలను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ సమస్యలు లేకుండా ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేశారు.

బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దు..



ఈ ఏడాది రహదారి ప్రమాదాల్లో ఇద్దరు మైనర్లు మృత్యువాత పడ్డారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై నెలకు సుమారు 110 కేసులు, మైనర్లపై 100 కేసులు నమోదు అవుతున్నాయి. ఎప్పటికప్పుడు మైనర్లకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వ్యక్తులు మాత్రమే వాహనాలు నడపాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహన చోదకులు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తున్నాం.

– ఎం.వెంకట నారాయణ, ట్రాఫిక్ సీఐ, అనకాపల్లి

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట: రోడ్డు ప్రమాదాలకు గురి కాకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ అల్లు స్వామినాయుడు కోరారు. మండలంలోని బయ్యవరంలో ఉన్న సాగర్ సిమెంట్ పరిశ్రమ కార్మికులతో శనివారం సమావేశం నిర్వహించి రోడ్డు ప్రమాదాలు-ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించకపోవడం వల్ల ప్రమాదాలకు గురైనప్పుడు వారు చాలా వరకు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. అలాగే అంగ వైకల్యానికి గురవుతున్నారన్నారు. దీని దృష్ట్యా బైక్ వినియోగించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

ఏలేరు బ్రిడ్జిపై గోతులతో ఇక్కట్లు



కొప్పాక ఏలేరు కాలువ బ్రిడ్జిపై వర్షపు నీరు

అనకాపల్లి: కొప్పాక ఏలేరు కాలువ బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న గోతులు వర్షపు నీటితో నిండిపోయాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదే రహదారిలో నేటి వరకూ 10 ప్రమాదాలు జరిగాయి. అనేక వాహనాలు మరామ్మతులకు గురవుతున్నాయి. రాత్రి సమయంలో బ్రిడ్జి వద్ద విద్యుత్ లైట్లు లేకపోవడంతో సమస్య మరింత జటిలమవుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాల సేకరణ ధర తగ్గించడం శోచనీయం



పాడి రైతులతో మాట్లాడుతున్న సిఐటీయూ జిల్లా నాయకుడు శ్రీనివాసరావు

కశింకోట: విశాఖ డెయిరీ పాల సేకరణ ధరను పెంచి పాడి రైతులను ప్రోత్సహించాల్సింది పోయి ధరలు తగ్గించడం శోచనీయమని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బయ్యవరంలో పాల సంఘం రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఒకవైపు నిత్యావసర ధరలు, దాణా ధరలుపెరిగిపోతుంటే పాల ధర తగ్గించడం సమంజసం కాదన్నారు. కృష్ణా జిల్లాలోని సహకార డెయిరీ ఆవు పాలు లీటరుకు రూపాయిన్నర, గేదె పాలకు రూ.2 వంతున అదనంగా పెంచిందని, కర్ణాటకలో లీటరుకు రూ.5 నుంచి రూ.7 వరకు పెంచి పాడి రైతులను ప్రోత్సహిస్తూ ఆదుకుంటున్నారన్నారు. అలాగే విశాఖ డెయిరీలో లీటరు ఆవు పాలకు రూ.50, గేదె పాలకు రూ.80 వంతున చెల్లించాలన్నారు. దాణాను 75 శాతం రాయితీపై ఇవ్వాలన్నారు. లేదంటే డిసెంబర్ 2న రైతులతో వచ్చి విశాఖ డెయిరీని ముట్టడించనున్నామని, రైతులంతా కార్యక్రమానికి తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు, వైద్య సేవలపై అవగాహన

మాకవరపాలెం: మండలంలోని గిడుతూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం క్షేత్ర సందర్శనలో భాగంగా స్థానిక పీహెచ్‌సీతో పాటు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును సందర్శించారు. బ్యాంకులో అందించే సేవలు, లావాదేవీలపై సిబ్బంది అవగాహన కల్పించారు. అలాగే పీహెచ్‌సీలో రోగులకు అందించే వైద్య సేవలు, లభించే మందుల వివరాలను తెలియజేశారు. ఈ క్షేత్ర సందర్శనతో విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెంపొందుతుందని పాఠశాల హెచ్ఎం బాబ్జీరావు అన్నారు.

ఆడపిల్లలను సంరక్షిద్దాం



అడ్వైజరీ కమిటీతో సమావేశమైన ఏవో సూర్యనారాయణ

నర్సీపట్నం : ఆడపిల్లల సంరక్షణ, పీసీపీ ఎన్‌డీటీ చట్టం తదితరాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని డివిజన్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆర్డీవో కార్యాలయం ఏవో సూర్యనారాయణ పేర్కొన్నారు. లింగ నిర్ధారణ జరగకుండా స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అన్ని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రతి రోజు పీసీపీ ఎన్‌డీటీ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే వైద్యాధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో పీవో ఎన్‌సీడీ డాక్టర్ ప్రశాంతి, జిల్లా అదనపు వైద్యాధికారి జ్యోతి, డాక్టర్ లక్ష్మణరావు, లాయర్ చందు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి పాల్గొన్నారు.


గురజాడ సేవలు వెల కట్టలేనివి



గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

కశింకోట: కశింకోటలో ప్రముఖ కవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు వర్ధంతి సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను ప్రస్తుతించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, వివిధ సంఘాల ప్రతినిధులు తనూజ, జి. రామలక్ష్మి, శ్యామల, డి. వెంకటలక్ష్మి, జగదీశ్వరి, ఆర్. యమున, ఎం. నారాయణమ్మ, ఎం. రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'నేల'బారు చదువులు



నేలపై కూర్చుని చదువుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులు నేల బారు చదువులు చదువుతున్నారు. మొదటి ఇంటర్ విద్యార్థులు కూర్చునేందుకు సరిపడినన్ని బెంచీలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం కళాశాల ఆవరణలో నేల మీద కూర్చుని చదువుకుంటూ వారు సాక్షి కంటబడ్డారు.


హైందవ శంఖారావం విజయవంతం చేయాలి



కరపత్రాలు అందజేస్తున్న మండల వీహెచ్‌పీ అధ్యక్షుడు రామకొండలరావు

మాడుగుల రూరల్ : వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల వీహెచ్‌పీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు పేర్కొన్నారు. శనివారం రాత్రి ఆయన స్థానిక వీహెచ్‌పీ గ్రామ శాఖ కమిటీ సభ్యులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి, రక్షణ కోసం ఈ హైందవ శంఖారావం సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల ప్రఖండ కర్రి వరహాలురాజు, కె.జె.పురం గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జగన్నాథరావు, బి.జగ్గారావు, పరిమి కాసుల జగ్గారావు పాల్గొన్నారు. కార్యక్రమానికి సంబంధించి ఆదివారం సాయంత్రం 4 గంటలకు కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు రామకొండలరావు తెలిపారు.

సాధువుల గుడి వద్ద భారీ అన్న సమారాధన



శారదా నది ఒడ్డున కొలువైన ఉమా రామలింగేశ్వరస్వామి

అనకాపల్లి: స్థానిక గవరపాలెం, అరటిపళ్ల మార్కెట్ రహదారిలో అమృత మహాకాళేశ్వర స్వామి (సాధువుల గుడి) ఆలయంలో కార్తీక మాసం, అమావాస్యను పురస్కరించుకుని ఆలయ కమిటీ అధ్యక్షుడు పొలిమేర సత్యనారాయణ శివలింగానికి శనివారం తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కార్తీకమాసంలో నెల రోజుల పాటు స్వామి వారికి పూజలు జరుగుతాయని అన్నారు. జిల్లాలో శివాలయాల్లో శివలింగాలకు అర్చకులు మాత్రమే పూజలు చేస్తారని, అమృత మహా కాళేశ్వర స్వామికి స్వయంగా భక్తులే క్షీరాభిషేకం చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి బుద్ధ భూలోకనాయుడు, కమిటీ సభ్యులు కర్రి సీతా అప్పలనాయుడు, రామలింగేశ్వరరావు, శీలపరశెట్టి భాస్కరరావు, మొల్లేటి నాగేశ్వరరావు, బొడ్డేడ వెంకటరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపు భారీ అన్నసమారాధన

స్థానిక శారదా నది ఒడ్డున ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ఆఖరి సోమవారం సందర్భంగా శివలింగానికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం సుమారు 15 వేల మందికి భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు జెట్టి సూరిబాబు, పలకా కాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం నెలరోజులు స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అదేరోజు పోలిస్వర్గం కావడంతో సోమవారం తెల్లవారు జాము నుంచి శారదా నదిలో దీపాలు వదిలే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

దళిత కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



పౌరహక్కుల వేడుకలో మాట్లాడుతున్న మధుబాబు

అనకాపల్లి: గ్రామాల్లోని దళిత కాలనీల్లో నివసించే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు అన్నారు. మండలంలో అల్లిఖానుడుపాలెం గ్రామంలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవ వేడుకలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరహక్కులపై ప్రతి వ్యక్తి అవగహన కలిగి ఉండాలని, నెలలో ఒక రోజులో గంటపాటు పౌరహక్కుల వేడుకలు నిర్వహించడం వల్ల అక్కడ సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. దళిత కాలనీల్లో తాగునీటి సమస్య ఉందని, ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధి విద్యతోనే సాధ్యపడుతుందన్నారు. కాలనీలో ప్రభుత్వ స్థలం ఉందని, కమ్యూనిటీ హాలు, గ్రంథాలయం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. గ్రామాల్లో ఎక్కడైన సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్.కృష్ణమోహన్, డీటీ రాజేశ్వరి, ఆర్ఐ రమేష్, రూరల్ ఎస్ఐ జె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షంతో రైతుల ఆందోళన



అడ్డాం గ్రామంలో పండిన వరి పంట



వర్షం, గాలికి నేలకొరికిన వరి

కశింకోట: మండలంలో తుపాను ప్రభావం వల్ల వర్షాలు కురుస్తుండటంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు చిన్నపాటిగా కురిసిన వర్షాల వల్ల పెద్దగా నష్టం లేకపోయినా ఇంకా ఆదివారం వరకు తుపాను ప్రభావం ఉంటుందని, వర్షాలు కురుస్తాయని వాతావరణ హెచ్చరికలుండటం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చివరలో చేతికి అందకుండా పోయే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. ఇక ఈ వర్షాలు తగ్గిపోతే పంట నష్టపోకుండా గట్టెక్కుతామని, వర్షాలు గాని ఇంకా పడితే పంటను కోల్పోవలసి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే కురుస్తున్న వర్షంతో అక్కడక్కడ పండిన పొలాలు నేలకొరికాయి. ఇవి మరింతగా నెలకొరికే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. మండలంలో ఈ ఏడాది 1360 హెక్టార్లలో ఖరీఫ్ వరి పంట వేశారు. మొదట్లో భారీ వర్షాలు ఇబ్బంది పెట్టి కాస్త నష్టం కలిగించినా తర్వాత పంట ఎదిగి పండి చాలా వరకు కోత దశకు చేరుకుంది. స్వల్పకాలిక రకాలు వేయడంతో పాటు ముందుగా నాట్లు వేసిన చోట వరి పొలాలు పండి కోతకు చేరుకున్నాయి. ఇక పది రోజులు ఆగితే పండిన పంట కోతలు అయిపోయే తరుణంలో వర్షాలు కురవడం ఆందోళన కలిగిస్తుందని రైతులు పేర్కొంటున్నారు. కశింకోట, అడ్డాం, చెరకాం తదితర గ్రామాల్లో కొందరు ఇప్పటికే వరి కోతలు కోశారు. సుమారు పది ఎకరాల్లో కోతలు జరిగాయి. వాతావరణ హెచ్చరికలతో వాటిని ఆదరాబాదరా కూడదీసుకొని కుప్పలుగా పెట్టుకున్నారు. ఇక మిగిలిన వారు కోతకు సన్నద్ధమవుతున్న తరుణంలో తుపాను హెచ్చరికలతో కోతలను వాయిదా వేశారు. అయితే అవి పండిపోవడం వల్ల ప్రస్తుతం పడుతున్న వర్షాలకు నిలవలేక నేల మట్టం అవుతాయని, ధాన్యం మొలకలు వచ్చి పాడైపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తుపాను ముగిసాక కోతలు చేపట్టాలి..

ఇప్పటి వరకు తుపాను ప్రభావం వల్ల చిన్నగా వర్షం కురిసింది. దీనివల్ల వరి పంటకు నష్టం లేదు. అయితే ఆదివారం వరకు తుపాను హెచ్చరిక ఉంది. తుపాను సమసిన తర్వాత వరి కోతలు కోసుకోవడానికి రైతులు సిద్ధం కావలసి ఉంటుంది.

–ఎం. స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ



జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు మాస్కులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రామ్మూర్తి

అనకాపల్లి: వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.రామ్మూర్తి అన్నారు. స్థానిక ఉడ్‌పేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు శనివారం ఉచితంగా మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు పారిశుధ్య కార్మికులకు సహకరించాలని అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో త్వరలో బ్లడ్ డొనేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ హిమజాకిరణ్, సభ్యులు వెంకటరమణ, కన్నేశ్వరరావు, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం మళ్ల జగన్నాథ కల్యాణ మండపంలో ఆదివారం లోటస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు వి.మురళి, సురేష్, త్రినాథ్ శనివారం చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిర్వహించే ఈ శిబిరంలో గుండె నిపుణులు, జనరల్ ఫిజిషియన్, దంత వైద్యులు, న్యూరోసర్జన్ వైద్యులు రోగులకు సేవలు అందిస్తారని తెలిపారు.